పెన్షన్ కానుక.. ఆనంద వేడుక

- పెరిగిన పింఛన్‌తో లబ్ధిదారుల్లో సంతోషం
- కొత్తగా 953 మందికి మంజూరు
- నియోజకవర్గంలో లబ్ధిదారులు 26,988
- ప్రతీ నెలా పంపిణీ సొమ్ము రూ.7.45 కోట్లు


కార్యక్రమానికి హాజరైన నాయకులు, లబ్ధిదారులు


లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అవ్వా తాతలు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ సొమ్ము పెంచడంతో వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా పింఛన్ల సొమ్మును 2,750 రూపాయలకు పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం ఆయన పంపిణీ చేశారు.

అర్హతే ప్రాతిపదికగా..
ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లను వారి ఇళ్లవద్దకే తీసుకెళ్లి ఇప్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 26,035 పింఛన్లు ఉండగా కొత్తగా 953 మంది అర్హులను గుర్తించి వారికి కూడా పింఛన్లను అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. దీని కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.7 కోట్ల 45 లక్షల 12 వేలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా.. కేవలం అర్హత ఉంటే చాలు ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల కోసం నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి లేకుండా.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, ప్రతి ఇంటికీ వలంటీర్లు వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామున తలుపుకొట్టి మరీ పింఛన్లు అందజేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నపుడు కేవలం వారి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే లబ్ధి చేకూర్చేవారని, కానీ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ పాలన సాగిస్తున్నారన్నారు. ఇంకెవరూ భయపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోవడం ఖాయమని అన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏపీడీ సంతోష్, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, రాజాన రామారావు, గుడివాడ అనూష, ఇల్లపు వరలక్ష్మి, వార్డు ఇన్‌చార్జిలు కోమటి శ్రీనివాసరావు, దామా సుబ్బారావు, దొడ్డి రమణ, ధర్మాల శ్రీను, సిరట్ల వాసు, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మయ్య, బోగాది సన్నీ, నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, కొయ్య భారతి, బొడ్డ గోవింద్, సచివాలయం సీవోలు, ఆర్పీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి: పింఛన్ వారోత్సవాల్లో భాగంగా 85వ వార్డులోని లబ్ధిదారులకు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ పింఛన్ అందించారు. వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు, వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు కర్రి నరసింగరావు, వార్డు సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

68వ వార్డులో 58మందికి కొత్త పింఛన్లు
అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను కార్పొరేటర్ గుడివాడ అనూష లబ్ధిదారులకు అందజేశారు. అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వార్డు పరిధిలోని 6 సచివాలయాల్లో 58 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, నంబారు రాజు, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో మహిళకు పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ అనూష


70వ వార్డులో పింఛన్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ చందు

70వ వార్డులో..
గాజువాక: 70వ వార్డులో మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ ఉరుకూటి చందు లబ్ధిదారులకు అందజేశారు. నాయకులు పాలఘాట్ కృష్ణ, అచ్చిబాబు, కొణతాల రాము, భద్రం, భూషణం, బాబులు నాయుడు, చట్టి అప్పలరాజు, రాపేటి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

71వార్డులో 98మందికి ..
71వ వార్డులో మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ రాజాన రామారావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నెలలో కొత్తగా 98 మందికి మంజూరైనట్టు తెలిపారు. నాయకులు మురళి, గంజి సత్యనారాయణ, మింది రమేష్, కల్పన, బొండా అప్పారావు, పప్పల రాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.


71వ వార్డులో పింఛన్‌ను అందిస్తున్న కార్పొరేటర్ రామారావు

జగన్‌బాబు దయ వల్లే..



గత ప్రభుత్వ హయాంలో ఒక్క ప్రయోజనం కూడా పొందలేకపోయాను. పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నాకు పెన్షన్ రాశారు. నాకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛను వస్తుంది. నిజంగా జగన్‌బాబు దయ వల్లే ఇదంతా సాధ్యం అయింది. – సి.నూకాలమ్మ, కోరాడ

మాకు ఎంతో భరోసా



ఈ వయసులో మాకు పింఛన్ సొమ్ము ఎంతో భరోసా ఇస్తోంది. ఈ నెల నుంచి పెన్షన్ మరో రూ.250 పెరిగి, రూ.2,750 వస్తోంది. మందులు, ఇతర అవసరాల కోసం ఎవరిపై ఆధారపడక్కర్లేదు. చాలా ఆనందంగా ఉంది. ఎప్పటికీ జగన్ బాబే మా ముఖ్యమంత్రి. – సీహెచ్ కళావతి, చినగంట్యాడ

రుణపడి ఉంటాం



వృద్ధాప్యంలో మాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారు. పింఛన్ పెంచి ఇవ్వడం సంతోషంగా ఉంది. ఆయనకు రుణపడి ఉంటాం. గతంలో ఎవరూ పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు గౌరవంగా చూస్తున్నారు. –వై.సన్యాసిరావు, గోపాలరెడ్డి నగర్

ఎవరినీ అడిగే అవసరం ఉండదు



ప్రతి నెలా పెన్షన్ వస్తుంది.. ఇకపై ఎవరి వద్ద చేయిచాచాల్సిన పని లేదు. నా బతుకు నేను హాయిగా బతుకుతాను. గతంలో ఏ నాయకుడూ నాకు సాయం చేయలేదు. జగన్ బాబు దయ వల్ల ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. – జి.మురళి, రెడ్డి ముసలినాయుడుపాలెం

క్లుప్తంగా

వార్డు సచివాలయాల కన్వీనర్ల నియామకం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు సచివాలయ కన్వీనర్లుగా ముగ్గురు నియమితులయ్యారు. లంకెలపాలెం సచివాలయానికి గంగిరెడ్లకాలనీకి చెందిన మాకిరెడ్డి శ్రీను, పినమడక సచివాలయానికి కొయ్య రాంబాబు, సేనాపతి పార్వతి, చట్టి గోవింద్‌లను నియమించారు. తమ సేవలను గుర్తించిన ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, అదీప్‌రాజ్‌కు, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవం


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న శ్రీనివాసరావు


కూర్మన్నపాలెం: బ్రెయిలీ దినోత్సవాన్ని వడ్లపూడి భవిత కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఈవో పైడపునాయుడు, సహిత విద్య సమన్వయకర్త అబ్దుల్లా ఆశ ఆధ్వర్యంలో ఘనంగా ఈ వేడుకలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంధులను, పాక్షిక దృష్టి గల వారిని ఉత్సాహపరిచేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీనివాసరావు చేతులమీదుగా దివ్యాంగులకు వీల్‌చైర్లు, సెరిబ్రల్ పాల్సీ చైర్లు, ట్రైసైకిళ్లు రోలేటర్లు, వినికిడి యంత్రాలతో పాటు దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వారికి మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉమాదేవి, భవిత కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమం నిర్వహించారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్


నిందితుడిని విచారిస్తున్న సెబ్ సీఐ సరోజా దేవి

సింహాచలం: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని బుధవారం పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద సెబ్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం పెందుర్తి ఎస్ఈబీ అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా పెందుర్తి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఖాళీస్థలంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద మూడు కిలోల డ్రై గంజాయి ఉండటంతో అతన్ని అరెస్టు చేశారు. సెబ్ సీఐ సరోజాదేవి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధతో పింఛన్ పునరుద్ధరణ

- ఒక్క దరఖాస్తుతో సమస్య పరిష్కరించిన సచివాలయ శాఖ రాష్ట్ర కార్యాలయం
- వృద్ధుడికి పింఛన్ మంజూరు

పెదగంట్యాడ: అర్హత ఉన్న చివరి లబ్ధిదారుని వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలన్న ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పని చేస్తోంది. తాజాగా జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన తాలాబత్తుల బ్రహ్మాజీరావుకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయడమే ఇందుకు నిదర్శనం.

కూలి పని చేసుకుంటూ జీవించే బ్రహ్మాజీరావు (61)కు అర్హత ఉన్నా పింఛన్ రావడం లేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. పైగా అతడు ఇదివరకే పింఛను పొంది, ఇప్పుడు మరణించినట్టు రికార్డుల్లో ఉండడంతో గందరగోళం నెలకొంది. దీనిపై వార్డు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోగా అప్రమత్తమైన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ రాష్ట్ర కార్యాలయం ఈ విషయంపై వెంటనే విచారణ చేపట్టింది. సచివాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ మోహన్ ఆదేశాల మేరకు, అదనపు కమిషనర్ (అర్బన్) సోమన్నారాయణ ఈ కేసును ప్రత్యేకంగా తీసుకుని చర్యలు చేపట్టారు. బ్రహ్మాజీరావుకు చెందిన ఆధార్ నంబర్ మీద, అదే ప్రాంతంలో ఉన్న మరొక వ్యక్తి పింఛను పొందుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో అసలు లబ్ధిదారు అయిన బ్రహ్మాజీరావుకు పింఛను అందడం లేదని గుర్తించారు. వెంటనే తగిన చర్యలు చేపట్టి, అతని పింఛను పునరుద్ధరించారు.


బ్రహ్మాజీరావుకు వృద్ధాప్య పెన్షన్‌ను అందజేస్తున్న వలంటీర్

అసలు రాదనుకున్నా..
కొత్త సంవత్సరంలో తొలిసారి పింఛను మొత్తం రూ.2750 అందుకున్న బ్రహ్మాజీరావు ఆనందానికి అవధుల్లేవు. అసలు తనకు ఇక ఈ జన్మలో పింఛను రాదని చాలా నిరుత్సాహపడ్డానని, అధికారులు ఇంత బాధ్యతగా చర్యలు చేపట్టి వేగంగా సమస్య పరిష్కరిస్తారని అనుకోలేదని అన్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు

రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన

అగనంపూడి: జీవీఎంసీ విలీన గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు అగనంపూడి బంగారమ్మగుడి, సాయినగర్ కాలనీల్లో రూ.40లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ వార్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మరో ఏడాదిలో వార్డు రూపురేఖలు మారనున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ, నక్కా రమణబాబు, ఏదూరి రాజేష్, మామిడి శ్రీను, సాలాపు అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

జోరుగా ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం

ఉక్కునగరం: స్టీల్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మూడు ప్యానళ్ల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జ్యోతిరావు పూలే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ బుధవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రచారం నిర్వహించారు. తమ ప్యానల్‌ను గెలిపిస్తే మరిన్ని హక్కులు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహాలక్ష్మి నాయుడు, నమ్మి తాతారావు, పిల్లి చంద్రరావు, కొణతాల శ్రీనివాస్, కె.జె. అప్పారావు, వి.సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- యునైటెడ్ ప్యానల్‌ను గెలిపించాలని ప్యానల్ అధ్యక్ష అభ్యర్థి బి. అప్పారావు, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి ఎం. శ్రీనివాసరావు కోరారు. బుధవారం మెయిన్ గేటు వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తమ ప్యానల్‌ను గెలిపిస్తే ఓబీసీ ఉద్యోగుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వై.ఎల్. నాయుడు, ఆర్.వి. నారాయణ, కోయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న యునైటెడ్ ప్యానల్ అభ్యర్థులు

మంచినీటి పైపులైన్ల పరిశీలన


పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మంచినీటి కుళాయిలను వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ బుధవారం పరిశీలించారు. కుళాయిల ద్వారా తాగునీరు అపరిశుభ్రంగా వస్తుందనే ఫిర్యాదు రావడంతో వాటర్ ఏఈ మనోహర్‌తో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామంలో ఒక చోట మంచినీటి పైపు పగిలి, పక్కనున్న మురుగు కాలువలో నీరు వృథాగా పోతుండటాన్ని గమనించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లతీష్ వాటర్ ఏఈ మనోహర్‌ను కోరగా, మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏఈ తెలిపారు. వాటర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గుడియా శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, నంబారు రాజు, గ్రామ నాయకుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌టీయూసీ ధర్నా

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించనున్నారు. ఉక్కు కార్మికుల వేతన ఒప్పందానికి సంబంధించి ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు ఎల్ అండ్ డీసీ కేంద్రం వద్ద జరగనున్న ధర్నాలో యూనియన్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు కోరారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

పెదగంట్యాడ: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 64వ వార్డు పరిధి యారాడలోని పీఎస్సార్ కాలనీ, ఎస్ఏఆర్ కాలనీ, కొత్తపేట, ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో బుధవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారం
మంగళవారం ఇక్కడి ప్రజలు మంచినీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన అధికారులతో మాట్లాడి, బుధవారం నాటికి మూడు మంచినీటి బోర్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. వీధి దీపాలను వెలిగించారు. సమస్యలు వెంటనే పరిష్కారం కావడంపై ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వాసు, నాగోతి సన్యాసిరావు, చీపుర్ల వెంకట అప్పారావు, బంక శ్రీనివాస్, గుజ్జారి లలిత, నాగోతి పార్వతి, బాబీ, భరత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కార్మికుల వేతనాల చెల్లింపునకు వినతి


వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

గాజువాక: గాజువాక జోన్‌లోని పారిశుద్ధ్య కార్మికుల మిస్సింగ్ జీతాలను చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులు గాజువాక జోనల్ సహాయ వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రతి నెలా ఏదో ఒక వార్డులో ఒకరిద్దరు కార్మికులకు జీతాలు మిస్ అయిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ విధంగా ఇప్పటివరకు 60 మంది కార్మికులకు జీతాలను చెల్లించాల్సి ఉందన్నారు. ఈ జీతాలను చెల్లించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జోన్‌లో డెత్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, గొల్ల రాము, ఎస్.గణేష్, నక్క నాగరాజు, మీనాక్షి, వెంకటరావు తదితరులున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 692వ రోజుకుచేరుకున్నాయి. ఈ దీక్షలో డబ్ల్యూ.ఎం.డి, యుటిలిటీ, అడ్మిన్, టీపీ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని మన రాష్ట్ర పార్లమెంట్ సభ్యులందరూ కలిసి ప్రస్తుత పార్లమెంట్‌లో గళమెత్తాలని కోరారు. విశాఖ ఉక్కు కోసం ప్రత్యేకంగా చర్చించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కోవడం కోసం కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.ఈశ్వరరావు, వి.ఎస్.వరప్రసాద్, బి.బాలస్వామి, ఎన్.నాగార్జున పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో దీపాలంకరణ సేవ

సింహాచలం: ధనుర్మాస పూజలు బుధవారం పలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారు జామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరు వీధిని వైభవంగా నిర్వహించారు.

- పెందుర్తి మండలం చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో శంఖుచక్ర నామాలకు విశేష దీపాలంకరణ చేశారు. పాశురవిన్నప పారాయణ నిర్వహించారు.
- పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు.తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవి చెంతన ప్రత్యేక పూజలు చేసి హారతులు అందజేశారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రయోజనకర సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

